క్లుప్తంగా

రామకృష్ణాపురంలో చైన్ స్నాచింగ్



గొలుసు లాక్కొని పరారవుతున్న దుండగుడు

చీరాల: ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని గొలుసును లాక్కెళ్లారు దుండగుడు. ఈఘటన చీరాల రూరల్ మండలం రామకృష్ణాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. రామకృష్ణాపురంలోని యోగా బజారులో ఓ మహిళ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తోంది. ఈక్రమంలో ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగుడు మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లాడు. ఒక్కసారిగా నిర్ఘాంతపోయిన మహిళ ప్రతిఘటించడంతో సగం గొలుసును లాక్కొని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు. ఈదృశ్యాలు అదే ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

విలువలతో కూడిన విద్యనందించడమే లక్ష్యం

చీరాల టౌన్: ప్రాచుర్యం కలిగిన వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ విద్యాసంస్థలు విద్యార్థులకు విలువలతో కూడిన సాంకేతిక విద్యనందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ పాగడదండ రవికుమార్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక విద్యలో నూతన విప్లవాన్ని తీసుకిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందరికి ఇంజినీరింగ్ విద్యనందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదద్దుతున్నామన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ కోటాలో 50 సీట్లు ప్రతిభకలిగిన పేద విద్యార్థులకు ఉచితంగా అందిస్తు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

అయోమయంలో రైతన్న !

- ఏ పంట వేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు
- గతేడాది నుంచి ధరలేని మిర్చి
- పొగాకుకు భలే డిమాండ్
- రైతులను ఆదుకోని ప్రభుత్వం

జే.పంగులూరు: ఈఏడాది రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అటు విత్తనాలు, ఇటు ఎరువులు సరిపడినంతా లేవు. అన్నిటికన్నా ముఖ్యంగా సరైన వర్షాలు లేకపోవడంతో రైతన్నలు నిరాశగా ఉన్నారు. మామూలుగా ఖరీఫ్‌లో అయితే ఈపాటికి ఏపంటలైన మోకాళ్ల ఎత్తున పైర్లు పచ్చగా కనబడుతుండేవి. కాని ఆపరిస్థితి నేడు కనిపించడం లేదు. ఒట్టి జల్లులతోనే వరుణదేవుడు కరుణించి మమ అంటున్నాడు. అన్నదాతలందరూ అయోమయంలో ఉన్నారు. ఒక వైపు వ్యవసాయానికి పెరిగిన పెట్టుబడులను చూసి భయపడుతున్నాడు రైతు. మరోవైపు రైతుల అశలతో వర్షం దోబూచులాడుతోంది. ఇంకో వైపు రైతులకు అందని రైతు భరోసా డబ్బులు. గత వారంలో కొంతమేర వర్షం పడిన అది పూర్తి స్థాయిలో భూములు పదును కాలేదు. గత రెండు రోజుల నుంచి వర్షం పడుతున్నా అనుకున్న స్థాయిలో వర్షం పడక భూములు పదును కాలేదు. రుతుపవనాలు వచ్చాయి పూర్తి స్థాయిలో వర్షం పడుతుందని శాస్త్రవేత్తలు చెప్పటంతో రైతులలో అనందం వ్యక్తం అయింది. అదిగో, ఇదిగో అల్పపీడనం అంటూ వాతావరన శాఖ హడావుడితో జూన్, జూలైలో చెదురు మదురు జల్లులు మినహా వర్షం పూర్తిగా మొహం చాటేసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినా ఇప్పటికి వ్యవసాయ పనులు ప్రారంభం అయిన దాఖలాలు లేవు. దుక్కులు దున్నుదాం అంటే పొలం పదును కాకపోవటంతో రైతులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

వర్షం పడకపోతే వ్యవసాయం కష్టమే..

పొలం దున్నుతున్నా నాగలి సరిగా భూమిలోకి దిగడం లేదు. సరైన పదును లేదు. ఈ పదునుతో రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు. ఇప్పటికి సరైనా వర్షం పడలేదు. ప్రభుత్వం కూడా రైతులకు ఇవ్వాల్సిన సాయం అందిస్తే కొంత మేర ఉపశమనం లభిస్తుంది.

– వానుపల్లి సుబ్బారెడ్డి, కొండమూరు, రైతు



బూదవాడ గ్రామంలో పొలం దున్నుతున్న రైతు

భారీగా పెరిగిన విత్తనాలు, ఎరువుల ధరలు..

ఈ ఏడాది విత్తనాలు, ఎరువుల ధరలు బారీగా పెరిగాయి. రైతుల భరోసా విషయంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెట్టుబడులకు ఏంచేయాలో అర్థం కావటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధైర్యం చేసి ఏం పంటవేయాలో రైతులకు అర్థం కాని పరిస్థితి. ఒక వైపు ప్రకృతిని నమ్మలేని పరిస్థితి. మరోవైపు సాగర్ జలాలు పూర్తి స్థాయిలో అందుతాయో లేదని అర్థం కావటంలేదు. శ్రమలకు ఓర్చి పంటలు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేని పరిస్థితి నెలకొంది. గత సంవత్సరం మండల పరిధిలో ఎక్కువ మిర్చి, పొగాకు పండించారు. మిర్చికు మొదటి కోత అనుకున్న రేటు అందినా, రెండు, మూడు కోతలకు ధర పూర్తిగా పడిపోయింది. దీనితో రైతులు చేసేది లేక కోల్డ్ స్టోరేజీకి తరలించారు. ఇప్పటికి మిర్చి పంటకు సరైన ధర రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం పొగాకు పంటకు గిట్టుబాటు ధర పలకింది. ఈ సంవత్సరం రైతులు వాటి వైపు మొగ్గుచూపుతున్నారు. గత సంవత్సరం మిర్చి పంటకు గిట్టుబాటు ధరలేదు. ఈ సంవత్సరం మండలంలో మిర్చి పంట సాగు తక్కువగా ఉంటుంది. గిట్టుబాటు ధర పలికిన పంటలను వేయాలంటే భయపడే పరిస్థితికి రైతులు చేరుకున్నారు.

గత ప్రభుత్వంలో రైతులకు ఐదేళ్లలో అందజేసిన రైతుభరోసా నగదు

మండలం	రైతులు	రూ.కోట్లలో
అద్దంకి	9543	15.74
బల్లికురవ	10245	61.69
జే.పంగులూరు	7358	34.51
కొరిశపాడు	6687	32.52
సంతమాగులూరు	10330	70.74

జూలై ఆఖరులోపు వర్షం పడకపోతే అంతేసంగతులు..

అద్దంకి నియోజకవర్గంలోని జే.పంగులూరు, అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు ఐదు మండలాల్లో ఖరీఫ్ సాధార్ణ విస్తీర్ణం 1,20,432 ఎకరాలు ఉంది. అందులో పత్తి, మిరప, కంది, మొక్కజొన్న, మినుము, వరి పంటలను సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. నల్లరేగడి నేలలు పదును కాకపోవటం, ఇప్పటికే పదునైన నేలలు కూడా ఆరిపోవటంతో మెట్ట పంటలు వేసే రైతులు ఆలోచనలో పడ్డారు. జూన్, జూలైలో ఇంత వరకు వర్షం సరిగా పడిన దాఖలాలు లేవు. ఇక జులై నెలాఖరులోనైన వర్షం పడకపోతే ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు వేయటం అనుమానమే. గత వారంలో పడిన వర్షలకు కొందరు రైతులు విత్తనాలు నాటిన అవి ఇంత వరకు మొలకలు రానే లేదు. ప్రస్తుతం సరైన వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. మరో వైపు మొట్ట పొలాలల్లో రైతులు దుక్కులు దున్నుటంలో నిమగ్నమైఉన్నారు. కొన్ని చోట్ల భూములు పదును కాకపోవటంతో దుక్కులు కూడా సరిగా రావటం లేదని రైతన్నలు కూడా ఆవేదన చెందుతున్నారు. గట్టి వర్షం పడి వాగులు వంకలు ప్రవహించి భూగర్బ జలాలు పెరిగితే కాని వ్యవసాయ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కావు.



ట్రాక్టరుతో పొలం దున్నుతున్న రైతు



పదును కాకపోవటంతో దున్నకుండా వదిలివేసిన పొలం

రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- మండల సమావేశంలో సభ్యుల విజ్ఞప్తి

కారంచేడు: జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పొలాలకు చెందిన రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండల వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, సభ్యులు కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడు మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరుగుతున్న మొదటి సమావేశంలో ఎన్నికయిన ప్రభుత్వ నాయకులకు అభినందనలు తెలిపారు. నూతన పాలకులు, ప్రభుత్వం కూడా మండల పరిషత్ అభివృద్ధికి, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈపురుపాలెం నుంచి కారంచేడు మీదగా పర్చూరు వైపునకు వెళ్తున్న వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ రహదారికి ఇరువైపులా పోలాలు ఉన్న రైతుల సమస్యలు పట్టించుకోకుండా విధి, విధానాలు సరిగ్గా లేకుండానే పనులు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో పంట కాలువలు, పలక కాలువలు, డ్రైనేజ్‌ల వద్ద అవసరమైన వంతెనల నిర్మాణాలు లేకుండానే, మురుగు ప్రవహించే ఏర్పాట్లు పూర్తిస్థాయిలో లేకుండా పనులు జరుగుతున్నాయని, వీటి వలన అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు కోరారు. దీంతో తహసీల్దారు మెహర్‌కుమార్ మాట్లాడుతూ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విష జ్వరాలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతున్నాయని మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్ సమావేశ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సుబ్బారావు, ఐనంపూడి వనజ, ఎంపీడీఓ బీ బాబూరావు, ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న పాలకులు, అధికారులు

27న రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్

చీరాల రూరల్: అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 27న కాకినాడలో నిర్వహించే 17వ రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ సదస్సుకు న్యాయవాదులు రావాలని చీరాల బార్ అసోసియేషన్‌లోని ఫౌండేషన్ న్యాయవాదులు శుక్రవారం ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ జిల్లా నాయకులు మిక్కిలి పుల్లయ్య, చెల్లా సురేష్, ఎస్‌డీ కరుణకుమారిలు మాట్లాడుతూ నిజాయితీగల నాయకత్వం సమాజ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దగలుతుందనే నమ్మకంతో అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్‌ను గత పదేళ్లుగా న్యాయవాది పినిపే రామకృష్ణ ఆధ్వర్యంలో దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, రూల్ ఆఫ్ లా అమలు కావాలంటే న్యాయవాదులు, మేధావులు సంఘటితం కావాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో ఉన్న నామినేటెడ్ పోస్టులైన ఏజీపీలు, ఏపీపీలు ఇతర పోస్టులను రిజర్వేషన్ ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులకు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంతెన అశోక్ కుమార్, ఐనంపూడి పవన్ కుమార్, దుడ్డు పున్నయ్య, పేర్లి సాంబయ్య, మేరుగ రవికుమార్, బిల్లా ఆరోగ్యరావు తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు

చీరాల: ప్రస్తుత మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా ఉన్నాయని, అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం వంటి పలురకాల నిత్యవసర వస్తువులను తక్కువ ధరలకు అందిస్తున్నామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం వేటపాలెం గడియార స్తంభంలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కిలో బియ్యం రూ.48, దేశవాళీ కందిపప్పు రూ.160 చొప్పున విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు రైస్, దాల్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎవరైనా అక్రమ నిల్వలు చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.కృష్ణకాంత్, రెవెన్యూ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సహ చట్టం పౌరుల చేతి పాశుపతాస్త్రం

అద్దంకి: ఏ ప్రభుత్వ కార్యాలయంనుంచైనా సమాచారాన్ని పొందే అధికారం పౌరులకు సమాచార హక్కు చట్టం కల్పించిందని మండల వ్యవసాయాధికారి కొత్రపాటి వెంకటకృష్ణ అన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ ఆదేశానుసారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, ప్రజలు, గ్రామస్థాయి అధికారులకు సహ చట్టంపై శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయవాది బత్తుల రామకోటయ్య హాజరై మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అనేది పౌరుల చేతిలో పాశుపతాస్త్రంలాంటిదని, ప్రజలకు ఉపయోగపడే ప్రతి సమాచారాన్ని ఏ కార్యాలయం నుంచైనా పొందే హక్కు ఈ చట్టం పౌరులకు కల్పించిందని చెప్పారు. తనకు అవసరమైన సమాచారం కోసం దరఖాస్తుదారుడు కోరితే 30 రోజుల్లోపుగా, ఇవ్వాలని లేకపోతే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, ఎంఈవో గంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి, పంచాయతీ రాజ్ ఇంజనీర్ ఎల్.వెంకటేశ్వర్లు, ఉద్యాన శాఖాధికారి దీప్తి, వెలుగు ఏపీఎం కోటేశ్వరరావు, ఏపీవో గాయత్రి లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, టెక్నికల్ ఏఓ మేరమ్మ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణ

ఆగస్టు 19న జాతీయస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు

చీరాల టౌన్: ఆగస్టు 19 ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని చీరాల కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నామని కమిటీ చైర్మన్ సురేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఫొటోగ్రఫీ పోటీల్లో కలర్ (ఓపెన్), మోనోక్రోం (ఓపెన్), మదర్ అండ్ చైల్డ్ (కలర్) విభాగాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో విభాగానికి నాలుగు ఫోటోలను చీరాల కెమెరా క్లబ్ మెయిల్‌కు పంపించాలని సూచించారు. వివరాలకు 98482 42634, 99487 93626 నంబర్లను సంప్రదించాలని ఆయన ప్రకటనలో కోరారు.

ఎట్టకేలకు స్పందించిన అధికారులు



స్పీడు బ్రేకర్లను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చీరాల రూరల్: స్పీడు బ్రేకర్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వచ్చిన కథనంతో అధికారులు ఎట్టకేలకు నిద్ర మేల్కొన్నారు. వాడరేవు రోడ్డులో స్పీడు బ్రేకర్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని జూన్ 17న సాక్షిలో కథనం ప్రచురితమయ్యింది. దీంతో అధికారులు శుక్రవారం స్పందించి ఆరు స్పీడు బ్రేకర్లను తొలగించారు. అయితే ఆరింటిలో ఒక స్పీడు బ్రేకర్‌ను యథాతథంగా ఉంచారు. స్పీడు బ్రేకర్లను తొలగించడంతో స్థానికులతో పాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఇబ్బందులను సాక్షిలో ప్రచురితం చేసి అధికారులకు కనువిప్పు కలిగించి వాటిని తొలగించినందుకు సాక్షికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రేపు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జే.పంగులూరు: రేపు పంగులూరు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరగనున్నట్లు రొటేరియన్ వీరరాఘవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, డిస్ట్రిక్ట్ గవర్నర్ (3150) ఎస్వీ రాంప్రసాద్, చైర్మన్ గవర్నర్ అపాయింట్‌మెంట్స్ కొల్లా సింగరావు, అసిస్టెంట్ గవర్నర్ తేళ్ల రమేష్ చంద్ర తదితరులు పాల్గొనున్నట్లు తెలిపారు. క్లబ్ నూతన కార్యవర్గ అధ్యక్షుడు షేక్ కాలేషావలి, కార్యదర్శి బత్తుల వీరనారాయణ, ట్రెజరర్ జాగర్లమూడి సుబ్బారావు (జేకేసీ)లను ఎన్నుకొన్నట్లు తెలిపారు.

పేద మహిళకు కుట్టుమిషన్ అందజేత

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఉన్నం శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి మనవడు ఆహన్స్, మనువరాలు రీతుషలు శుక్రవారం రోటరీ కార్యాలయంలో అద్దంకిలోని కొత్తపేటకు చెందిన పేద మహిళ కొల్లిపర లావణ్యకు కుట్టు మిషన్‌ను, స్థానిక రాజీవ్ కాలనీలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలకు నాలుగు కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య దాతలను అభినందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధికారి, ఉటుకూరి ఉమా అన్నపూర్ణ, కార్యదర్శి చుండూరి సుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి నిధులు విడుదల చేయాలని నేడు నిరసన

మేదరమెట్ల: ఉపాధిహామీ పనులకు సంబంధించిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ నేడు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే నిరసనలో భాగంగా కొరిశపాడు మండల కార్యాలయం వద్ద శనివారం నిరసన కార్యక్రమం ఉంటుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మోంద్రు అంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. పనిచూపడం లేదా నిరుద్యోగ భృతిని కల్పించడం చేయాలని, ఉపాధిహామీ నిధులను బడ్జెట్‌లో పెంచాలన్నారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమం ఉంటుందని, మండలంలోని ఉపాధిహామీ కార్మికులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు సమాచార హక్కు చట్టంపై సదస్సు

బల్లికురవ: సమాచార హక్కు చట్టంపై గ్రామాల వారీగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి ఎస్‌పీపి కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ ఆదేశాల మేరకు మండలాల వారీగా సదస్సులు నిర్వహిస్తున్నామని మండలస్థాయి అధికారులు సిబ్బంది, ప్రజలు హాజరై అవగాహన పెంపొదించుకొవాలని కుమారి కోరారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండల కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సుకు అధికారులు, ప్రజలు హాజరుకావాలని వ్యవసాయాధికారి పీ.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వాసవీమాతకు ఆషాఢం సారె

చీరాల అర్బన్: వాసవీ క్లబ్ క్షీరపురి, గణేష్ యూత్, ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వాసవీ అమ్మవారికి ఆషాఢం సారె వేడుకను ఘనంగా నిర్వహించారు. అమరావారి వీధి నుంచి సంతబజారులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వరకు 108 రకాల పండ్లు, ఫలహారాలు, సారె వస్తువులతో మహిళలచే నగరోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సంతబజారులోని అమ్మవారి ఆలయంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా సారె సమర్పించారు. ప్రతి ఏటా అమ్మవారికి సారె వేడుక జరుపుతున్నామన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, సురేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీరువాలోని నగలు, నగదు మాయం

మేదరమెట్ల: తాళంలో వేసిన ఇంట్లో దుండగులు చొరబడి బీరువాలో ఉన్న నగదు, నగలు మాయం చేశారు. ఈఘటన కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామనికి చెందిన తిరుమల శెట్టి సుధారాణి ఇంటికి తాళం వేసుకొని పొగాకు పనికి వెళ్లింది. భర్త కూడా పనికి వెళ్లాడు. పనినుంచి తిరిగి ఇంటికి వచ్చిన సుధారాణి ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తీసి ఉన్నాయి. దీంతో ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించిన ఆమె బీరువాలోని సొమ్మును చూసుకోగా అందులో ఉన్న ఐదు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు కనిపించకపోవడంతో భర్తకు సమాచారం అందచేసి మేదరమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- ఉధృతంగా ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్

వర్షం తెచ్చిన ఇబ్బందులు

చీరాల టౌన్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంతర్గత రోడ్లతో పాటుగా ప్రధాన రహదారులు సైతం వర్షపు నీటితో నిండి ప్రజలు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మండలంలోని ప్రధాన రహదారులన్నీ వర్షం ధాటికి చెరువులుగా మారుతున్నాయి. వర్షానికి మండలంలోని ప్రధాన రహదారులైన ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామాల్లోని రహదారులన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. మోస్తరు వర్షం కురిస్తే చీరాల–ఒంగోలు, చీరాల–గుంటూరు ప్రధాన రహదారుల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రధాన రహదారుల్లో వర్షాలు పడిన సమయంలో నీరు నిల్వ చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కాని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై రెండు అడుగుల మేర నిల్వ చేరడంతో రాకపోకలు సాగించడంతో తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అలానే మండలంలోని ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ వర్షపు నీటి పారుదలతో నిండుకుండగా మారింది. రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువ ఉధృతంగా మారింది. పర్చూరు నియోజకవర్గం నుంచి వర్షపు నీరు స్ట్రయిట్‌కట్ కాలువ ద్వారా వాడరేవులోని దానవాయిపేటలో సముద్రంలో కలుస్తుంది. ఎగువ ప్రాంతం నుంచి అధికంగా వర్షపు నీరు రావడంతో కాలువలో నీటిమట్టం పెరిగిపోవడంతో స్ట్రయిట్‌కట్ వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. మళ్లీ భారీ వర్షాలు కురుస్తే స్ట్రయిట్‌కట్ ఉగ్రరూపం దాల్చితే ఇబ్బందులు తప్పవని సమీప ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు.



ఈపురుపాలెంలో చీరాల–గుంటూరు ప్రధాన రహదారి దుస్థితి ఇదీ



ఉధృతంగా వర్షపు నీటితో ప్రవహిస్తున్న స్ట్రయిట్‌కట్ కాలువ